
సాక్షి నిజామాబాద్

గురువారం । 20 । మార్చి । 2025



'మధ్యాహ్న' ఏజెన్సీలకు..
విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందిస్తున్న కోడిగుడ్డు ధరను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- IV లో ▸





వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పెరిగిన ఎండ తీవ్రత

- 41.1 గరిష్ట ఉష్ణోగ్రత నమోదు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో బుధవారం ఎండ తీవ్రత భారీగా పెరిగింది. మంచిప్పలో 41.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 25 ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. జిల్లాలో సాధారణం కన్నా ఒకటి నుంచి మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారి తెలిపారు.

హాల్ టికెట్‌పై హెచ్‌ఎం సంతకం అవసరం లేదు

నిజామాబాద్ అర్బన్: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై హెచ్‌ఎంల సంతకం అవసరం లేదని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లపై ఏదైనా తప్పున్నా విద్యార్థులు ఆందోళన చెందొద్దని, చీఫ్ సూపరింటెండెంట్ పరిశీలించి పరీక్ష రాసేందుకు అనుమతిస్తారని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఏవైనా సందేహాలుంటే 90302 82993 నంబర్‌ను సంప్రదించాలని, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

పాలియేటివ్ కేర్ సెంటర్ తనిఖీ

నిజామాబాద్‌నాగారం: జీజీహెచ్ ఆవరణలో ఉన్న పాలియేటివ్ సెంటర్‌ను జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి రాజశ్రీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే లెప్రసీ ట్రీట్‌మెంట్ వార్డును పరిశీలించారు. సిబ్బంది హాజరు, అందిస్తున్న సేవలు, అందుబాటులో ఉన్న మెడిసిన్ వివరాలను ఆరా తీశారు. సమయపాలన పాటిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. రికార్డులు, రిపోర్టులను నిర్వహించాలని, వివక్ష చూపకుండా కుష్టు వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించాలి అన్నారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేద్దాం



నిజామాబాద్‌నాగారం: తలసేమియా బాధిత చిన్నారుల కోసం త్వరలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేద్దామని పోలీస్ కమిషనర్ పోతరాజు సాయిచైతన్య రెడ్‌క్రాస్ బృందం సభ్యులతో అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బుధవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. సీపీని కలిసిన వారిలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కార్యదర్శి గోక అరుణ్‌బాబు, నిజామాబాద్ డివిజన్ చైర్మన్ డాక్టర్ శ్రీశైలం, డాక్టర్ రాజేశ్వర్, పీఆర్వో బొద్దుల రామకృష్ణ ఉన్నారు.

నిరాశ బడ్జెట్




రాష్ట్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా వాసులను నిరాశపరిచింది. జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రకటించడం మినహా ఇతరత్రా కొత్త ప్రాజెక్టుల ప్రకటన లేదు. జిల్లాలో కీలకమైన నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలకు సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ప్రధానమైన తెలంగాణ వర్సిటీకి నిధుల కేటాయింపులు ప్రత్యేకంగా చేయలేదు. ఏళ్లుగా ఎదురుచూస్తున్న జక్రాన్‌పల్లి విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ ఊసే లేదు. నిజామాబాద్ నగరంలో క్రీడా స్టేడియం ప్రకటన సైతం లేదు. శ్రీరాంసాగర్ మొదటి దశ ప్రాజెక్టు కోసం రూ.100 కోట్ల కేటాయింపులు చేసినప్పటికీ దీనివల్ల జిల్లాకు ప్రయోజనం లేదని వివిధ వర్గాలు అంటున్నాయి.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



అభివృద్ధి, సంక్షేమంలో సమానంగా ముందుకు..




అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్లేవిధంగా బడ్జెట్ ఉంది. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఐటీ, వ్యవసాయరంగాలకు అత్యధిక నిధులు కేటాయించడం హర్షణీయం. రైతు భరోసా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివద్ధి కోసం నిధులు కేటాయించారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు వృత్తి నైపుణ్యం అందించి, స్వయం ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త బాట వేసింది. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ విస్మరించిన అంశాలన్నింటికీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఎస్సీ సంక్షేమానికి రూ.40 వేల కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.17వేల కోట్లు, మైనారిటీ సంక్షేమానికి రూ.3,500 కోట్ల కేటాయించారు. అదేవిధంగా నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పిన రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రత్యేక ధన్యవాదాలు.
– మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్

కాంగ్రెస్ నాయకులు జేబులు నింపుకునే బడ్జెట్..



బడ్జెట్ కేవలం కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకునేవిధంగా ఉంది. మహిళలకు, వృద్ధులకు, చేనేత కార్మికులకు, ఆటో కార్మికులకు, దళితులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. ఇందూరు జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ బడ్జెట్‌లో దీనిపై స్పష్టత లేదు. వ్యవసాయ కేటాయింపులు కేవలం రైతుభరోసాకు మాత్రమే సరిపోతాయి. రుణమాఫీ, రైతు కూలీలు, కౌలు రైతుల సంక్షేమానికి నిధులు ఇవ్వలేదు. జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు ప్రస్తావన లేదు. తెలంగాణ యూనివర్సిటీకి నిధులు కేటాయించలేదు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు హామీ ఇచ్చినప్పటికీ దాని ఊసే లేదు. యువవికాసం పేరిట కాంగ్రెస్ కార్యకర్తలకు రూ.6వేల కోట్లు పంచడం సిగ్గుచేటు.
– కులాచారి దినేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఆరు గ్యారంటీలు ఎత్తేసి భట్టి ప్రకటించిన వొట్టి బడ్జెట్



2025–26 బడ్జెట్ తెలంగాణ ప్రజలను వంచించేలా ఉంది. అసెంబ్లీ సాక్షిగా పూర్తిగా అబద్ధాల చిట్టా చదివారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ వాటిని అమలు చేయలేమని చేతులెత్తేసినట్టే ఉంది. ఆర్థిక మంత్రి భట్టి వట్టి మాటలే చెప్పారు. కాకి లెక్కలతో అన్నివర్గాలను మోసం చేసినట్లు స్పష్టమైంది. మహాలక్ష్మి ద్వారా మహిళలకు రూ.2,500, ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం, చేయూత ద్వారా వృద్ధులకు, వితంతులకు పింఛన్ పెంపు, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఊసే లేదు. సగం కూడా రైతు రుణమాఫీ ఇవ్వకుండా పూర్తిగా ఇచ్చినట్లు చదివారు. కౌలు రైతుకు భరోసా ప్రస్తావన లేదు. ఎగ్గొట్టిన రైతు భరోసా ఊసే లేదు. ఏ రంగానికి తగిన కేటాయింపులు లేవు. ఆదాయం ఎలా సమకూర్చుకుంటారు, రెవెన్యూ లోటు ఎంత అనేది స్పష్టంగా చెప్పలేకపోయారు. యువ వికాసం పేరుతో కాంగ్రెస్ నాయకుల వికాసానికి మాత్రం రూ.6వేల కోట్లు అప్పనంగా అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. దీన్ని ఖచ్చితంగా అడ్డుకుంటాం.
– వేముల ప్రశాంత్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే

అన్ని వర్గాలను నిరాశపరిచింది..



బడ్జెట్ అన్ని వర్గాలను నిరాశపరిచింది. తెలంగాణ అమరుల కుటుంబాలకు ప్రభుత్వం మొండిచేయి చూపింది. అమరుల కుటుంబాలకు రూ.25 వేలు, ఉద్యోగం, ఇళ్ల ఊసే బడ్జెట్‌లో లేదు. ఐటీ అభివృద్ధికి కేవలం రూ.774 కోట్లు ఇచ్చి, మైనారిటీ సంక్షేమానికి రూ.3,591 కోట్లు కేటాయించి, అభివృద్ధికి బదులుగా మతపరమైన మోజుకే కాంగ్రెస్ ప్రాధాన్యత ఇచ్చింది. యువత భవిష్యత్తుతో ఆటలు ఆడుతోంది. బీసీ సంక్షేమానికి రూ.లక్ష కోట్లు అంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన కాంగ్రెస్ గత బడ్జెట్‌లో రూ.9200 కోట్లు, ఈ బడ్జెట్‌లో కేవలం రూ.11,400 కోట్లు మాత్రమే కేటాయించింది. బీసీల అభివృద్ధికి తక్కువ నిధులు కేటాయించడమంటే వారిని అణగదొక్కడమే. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని గొప్పలు చెప్పినప్పటికీ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 900 మంది విద్యార్థులు నాసిరకం భోజనం తిని అస్వస్థతకు గురయ్యారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఎంత మంది రైతు కూలీలకు రూ.12 వేలు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలి. – ధన్‌పాల్ సూర్యనారాయణ, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే

ఉపాధి కల్పనకు పెద్దపీట వేయాలి



ఉపాధి కల్పనకు రూ.900 కేటాయించడం హర్షణీయం. నిధులను విడతల వారీగా మరింత పెంచితే బాగుంటుంది. ఉపాధి కల్పనకు పెద్దపీట వేయాలి. స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద పీట వేయాలి. యువత స్కిల్ డెవలప్‌మెంట్‌కు అవకాశాలు కల్పించాలి. యువతకు ఉపాధి లభిస్తే అభివృద్ధితోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం సైతం పెరుగుతుంది.
– ఈరవత్రి రాజశేఖర్, చార్టెడ్ అకౌంటెంట్, ఆర్మూర్

రుణమాఫీపై స్పష్టత కరువు



రైతాంగానికి రూ. 2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రుణమాఫీని పూర్తిగా చేయలేదు. రుణమాఫీ కాకపోవడంతో చాలామంది రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్నవారికి మాఫీ కాలేదు. బడ్జెట్‌లో రుణమాఫీ గురించి ప్రస్తావించకపోవడం ప్రభుత్వ మోసపూరితమైన వాగ్దానానికి నిదర్శనం.
– నోముల నరేందర్‌రెడ్డి, రైతు, హసాకొత్తూర్

సంక్షేమంపై దృష్టి



సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. కేటాయింపుల్లో కీలకమైన సంక్షేమ పథకాలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్య సంరక్షణకు గణనీయంగా ఉండడం సమ్మిళితవృద్ధి కోసం ప్రభుత్వ అడుగులు ప్రతిబింబిస్తున్నాయి. రాబోయే దశాబ్దంలో ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలనే రాష్ట్ర దూరదృష్టి ప్రతిష్ఠాత్మకం, ఆశాజనకంగా చెప్పవచ్చు.
– పాత నాగరాజు, అసోసియేట్ ప్రొఫెసర్, తెయూ

విద్యుత్ చార్జీల పెంపు లేదు

- 2025–26 ఆర్థిక సంవత్సరానికి టారీఫ్ పెంపుదల ప్రతిపాదించలేదు
- గ్రీన్ ఎనర్జీ వినియోగించుకునే వారికి యూనిట్‌కు 0.66 గ్రీన్ టారీఫ్ విధింపు
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో విద్యుత్ చార్జీల పెంపుపై స్పష్టత వచ్చింది. బుధవారం హనుమకొండలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేసిన రిటైల్ సప్లయి వ్యాపారానికి సమగ్ర ఆదాయ ఆవశ్యకత, ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనలపై బహిరంగ విచారణ జరిగింది. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ దేవారాజు నాగార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ విచారణలో విద్యుత్ టారీఫ్‌ల ప్రతిపాదనలపై టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి టారీఫ్ పెంపుదలపై ఎలాంటి ప్రతిపాదనలూ చేయలేదని, ప్రస్తుత ధరల్లో ఎలాంటి మార్పూ లేదని స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీని ఎంచుకునే సంబంధిత ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులకు సాధారణ టారిఫ్ కంటే యూనిట్‌కు రూ. 0.66 గ్రీన్ టారీఫ్ విధింపు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ యాక్సెస్‌లో విద్యుత్ కొనుగోలు చేసి ఎన్పీడీసీఎల్ విద్యుత్ లైన్లు వినియోగించుకున్న వినియోగదారులకు ఎనర్జీ చార్జీల్లో 10 శాతం చొప్పున స్టాండ్ బై చార్జీల విధింపును కొనసాగిస్తున్నామన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ నిర్వహణకు 2025–2026 ఆర్థిక సంవత్సరంలో రూ.19,814 కోట్ల ఆదాయ ఆవశ్యకత ఉంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత టారిఫ్ (టారిఫేతర ఆదాయం కలుపుకుని) రూ.9,421కోట్లు వస్తుందని అంచనా. దీంతో రూ.10,393 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడుతుంది.

వందనం అభినందనం



సునీతావిలియమ్స్‌కు జననీరాజనం

- అంతరిక్షం నుంచి క్షేమంగా తిరిగి రావడం పై సర్వత్రా హర్షం
- ఆమె రాకకోసం ఉత్కంఠగా ఎదురు చూసిన ప్రజలు
- ఆకాశం హద్దును చెరిపేసిందంటూ ప్రశంసలు
- భారత సంతతికి చెందిన మహిళ కావడంతో గర్వంగా ఉందని ప్రశంసలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) నుంచి భారత సంతతి వ్యోమగామి సునీతావిలియమ్స్ సురక్షితంగా తిరిగి రావడంపై ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమె రాకకోసం వాడవాడలా అన్ని వర్గాల ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూశారు. అంతరిక్ష కేంద్రంలో తొమ్మిది నెలలపాటు ప్రయోగాలు చేసిన సునీత ప్రపంచ మానవాళికి ఎనలేని సేవచేసిందని పేర్కొంటున్నారు. ఒక మహిళగా సాధించలేని దేమీ లేదంటూ సునీత మరోసారి ఆకాశమే హద్దుగా నిరూపించారన్నారు. చరిత్రలో సునీత పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. సునీత భారత సంతితికి చెందిన మహిళ కావడంతో మరింత గర్వంగా ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారత్‌కు రావాలంటూ సునీతకు ఆహ్వాన లేఖ పంపడం మరింత సంతోషంగా ఉందంటున్నారు. 'మీ విజయం పట్ల భారతీయులు గర్విస్తున్నారు' అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేయడాన్ని ప్రస్తావిస్తున్నారు. సునీతను ప్రతిఒక్కరితో పాటు భావితరాల వారు సైతం ఆదర్శంగా తీసుకోవాల్సి ఉందంటున్నారు.

మహిళలను ప్రోత్సహించాలి



మహిళలు అన్నిరంగాల్లో ఆకాశమే హద్దుగా రాణిస్తారనేది పురాణ కాలం నుంచి తెలుస్తూనే ఉంది. అయితే తాజాగా సునీతావిలియమ్స్ సాధించిన విజయం విద్యార్థుల నుంచి మొదలు ప్రతిఒక్కరికీ ఆదర్శనీయం. భావితరాలకు సునీత జీవితం అతి పెద్ద పాఠం. ఆమె భారత సంతతికి చెందిన మహిళ కావడం మనందరికి గర్వకారణం.
– సరళ మహేందర్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది

భగవద్గీత పఠించడం ప్రత్యేకం



అంతరిక్షంలో తొమ్మిది నెలలకు పైగా ఉన్నానంటే అందుకు భగవద్గీత కారణమని సునీత చెప్పడం గొప్పవిషయం. భగవద్గీత కారణంగా ఆత్మబలం ఎంతో పెరిగిందని ఆమె చెప్పారు. భారతీయ మూలాలున్న మహిళ ఇంత గొప్ప విజయం సాధించడం మనందరం చాలా గర్వపడాల్సిన అంశం. – మంచాల జ్ఞానేందర్‌గుప్తా, సామాజిక సేవకుడు

చారిత్రక విజయం



సునీతావిలియమ్స్, బుచ్ విల్మోర్ ఐఎస్ఎస్ నుంచి తిరిగి సురక్షితంగా భూమికి తిరిగి రావడం అంతరిక్ష ప్రయాణంలో ఇది ఒక చారిత్రక విజయం. ఈ విజయం మానవ పట్టుదల, సాంకేతిక పురోగతి, అన్వేషణ స్ఫూర్తితోపాటు సునీత విలియమ్స్, ఆమె సహచర బృంద సభ్యుల సంకల్ప శక్తిని సూచిస్తుంది. – డాక్టర్ ఎం.సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, తెయూ

ధైర్యవంతురాలు సునీత



సునీతావిలియమ్స్ ధైర్యాన్ని మెచ్చుకోవాలి. రోదసిలో తొమ్మిది నెలలు గడపడం మామూలు విషయం కాదు. భారత సంతతికి చెందిన ఆమె మన దేశానికి గర్వకారణం. ఆమె ధైర్యం, సాహసం మనందిరికీ స్ఫూర్తినిస్తుంది. మనదేశంలోనూ గొప్పగొప్ప శాస్త్రవేత్తలు చాలా మంది ఉన్నారు. – లోచారం నారాయణ, ఫిజిక్స్ టీచర్, జెడ్పీహెచ్ఎస్, పడగల్

రైతులకు ఇబ్బందులు ఎదురవ్వొద్దు

సన్నాలకు రూ.500 బోనస్

- నేటి నుంచి అందుబాటులోకి ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- సన్నాహక సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు గురువారం నుంచి రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో బుధవారం ఆయా శాఖల అధికారులు, పీఏసీఎస్‌ల సీఈవోలు, ఐకేపీ సీసీలు, మెప్మా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. రైతులకు ఏ దశలోనూ ఇబ్బందులు తలెత్తకుండా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్ 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సన్నాలకు మద్దతుధరతోపాటు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు.

సేకరణ లక్ష్యం 9లక్షల మెట్రిక్ టన్నులు

యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా లక్షా 69వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేశారని కలెక్టర్ తెలిపారు. 11.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా కాగా, 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇందులో 6.80 లక్షల మెట్రిక్ టన్నులు సన్న, 2.20 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ఉంటుందని వివరించారు.

కొనుగోలు కేంద్రాలు 664

జిల్లాలో 664 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో సన్న ధాన్యం సేకరణకు 472, దొడ్డు ధాన్యం సేకరణకు 192 కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ వివరించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్, డీఏవో వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పర్యవేక్షించాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ హనుమంతు ఆదేశించారు. తూకం, తరుగు అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ప్రతిరోజూ కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించాలన్నారు. ధాన్యం సేకరణ వివరాలను వెంటవెంటనే ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తే త్వరితగతిన చెల్లింపులకు అవకాశం ఉంటుందన్నారు. బిల్లుల చెల్లింపుల్లో తప్పిదాలు చేస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఆరబెట్టి, శుభపర్చిన ధాన్యాన్ని తీసుకువచ్చేలా రైతులను చైతన్యపర్చాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచుకుని వెంటవెంటనే మిల్లులకు తరలించాలన్నారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని సూచించారు.

నగరంలో అర్ధరాత్రి సీపీ తనిఖీలు

- రోడ్లపై తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలో సీపీ పోతరాజు సాయిచైతన్య మంగళవారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించారు. ఎల్లమ్మగుట్ట, ఎల్ఐసీ చౌరస్తా, దేవీరోడ్డు చౌరస్తా, పూలాంగ్ చౌరస్తా, ఆర్ఆర్ చౌరస్తా, పెద్దబజార్, నెహ్రూపార్క్, హైమదీబజార్, బోధన్ బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆటోల ఆర్‌సీలు, డ్రైవర్ల లైసెన్సులను పరిశీలించి ఎటువైపు నుంచి ఎటువైపు వెళ్తున్నారని ప్రశ్నించారు. ఎలాంటి పని లేకుండా రాత్రి సమయంలో రోడ్లపై తిరిగే యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ పరిసరాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించి ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలకు సలహాలు, సూచనలు చేశారు.



ఆటోను ఆపి పత్రాలను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య



రైల్వే స్టేషన్‌లో తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీపీ

క్లుప్తంగా

ప్రొఫెసర్‌ కనకయ్యకు పురస్కారం



ప్రొఫెసర్‌ కనకయ్యను అవార్డుతో సత్కరిస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌ చైర్మన్‌ చిన్నారెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ అధ్యాపకులు ఆచార్య గుండె డప్పు కనకయ్యకు తెలంగాణ సారస్వత పరిషత్‌ ఆధ్వర్యంలో 'ఆచార్య మడుపు కులశేఖరరావు' పురస్కారం ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం రాత్రి జరిగిన 'ధర్మనిధి సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం' కార్యక్రమంలో ఆచార్య కనకయ్యకు పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్‌ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, సంస్థ ప్రతినిధులు, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించని సీడ్స్‌ కంపెనీ సీజ్‌



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలో ఉన్న మారుతీ సీడ్స్‌ కంపెనీని కమిషనర్‌ రాజు ఆదేశాల మేరకు సీజ్‌ చేసినట్లు మున్సిపల్‌ మేనేజర్‌ హయ్యూమ్‌ తెలిపారు. రెండు సంవత్సరాలుగా సీడ్స్‌ కంపెనీ మున్సిపల్‌కు ఆస్తి పన్ను చెల్లించడం లేదని పేర్కొన్నారు. పలు మార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో సీజ్‌ చేశామన్నారు.

హనుమాన్‌ మందిరంలో చోరీ

- నిందితుడికి దేహశుద్ధి చేసిన ఉత్తునూర్‌ గ్రామస్తులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



శ్రీకాంత్‌ మృతదేహం

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్‌ గ్రామ హనుమాన్‌ మందిరంలో మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన తూర్పు శ్రీకాంత్‌(28) చోరీకి పాల్పడ్డాడు. గుడిలోని హుండిని పగులగొట్టడంతో గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడ్డ శ్రీకాంత్‌ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు గతంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కత్తితో పొడిచి తీవ్రంగా గాయపర్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్‌ తెలిపారు.

సీపీని కలిసిన అధికారులు



సీపీ సాయిచైతన్యను కలిసిన ట్రైనీ కలెక్టర్‌ సంకేత్‌కుమార్‌, జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్‌



సీపీకి మొక్క అందజేస్తున్న ఏడీసీపీ శ్రీనివాస్‌రావు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ పోతరాజు సాయి చైతన్యను బుధవారం పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సీపీకి పుష్ప గుచ్ఛం అందజేశారు. సీపీని కలిసిన వారిలో నిజామాబాద్‌ ట్రెయినీ కలెక్టర్‌ సంకేత్‌ కుమార్‌, జగిత్యాల ఎస్పీ అశోక్‌ కుమార్‌, స్పెషల్‌ బ్రాంచ్‌ ఏసీపీ శ్రీనివాస్‌రావు ఉన్నారు.





లగేజీ తీసుకొని ఇంటికి వెళ్తున్న ఓ విద్యార్థిని

ఇంటిబాట

ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు పరీక్ష రాసిన అనంతరం కేంద్రాల నుంచి బయటికి వచ్చిన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కేరింతలు కొడుతూ సందడి చేశారు. హాస్టల్‌ విద్యార్థులు తమ లగేజీలు పట్టుకొని ఇంటి బాట పట్టారు. –సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌

రాష్ట్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

అసెంబ్లీలో బుధవారం ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లాలో మిశ్రమ స్పందన వచ్చింది. అన్నివర్గాలకు మేలు చేసే బడ్జెట్‌ అంటూ కొందరు సమర్థించగా, విద్యారంగంతోపాటు బీసీ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో మొండి చేయి చూపినట్లు పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

విద్యారంగానికి అన్యాయం



నిజామాబాద్‌అర్బన్‌: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం 7.57 శాతం మాత్రమే కేటాయించారు. ఈ నిధులు కేవలం జీతభత్యాలకే సరిపోతాయి. జిల్లాకు ఇంజినీరింగ్‌ కాలేజీ ఊసేలేదు. తెయూకి కూడా గతేడాది మాదిరిగానే బడ్జెట్‌ కేటాయించారు.
– రాజేశ్వర్‌, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

బడ్జెట్‌ అంకెల గారడీ



నిజామాబాద్‌ సిటీ: రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ కేవలం అంకెల గారడి. నిజాం షుగర్‌, సారంగపూర్‌ చక్కెర పరిశ్రమ పునరుద్ధరణ, పసుపు శుద్ధి కార్మాగారాన్ని నిర్మించేందుకు నిధులను కేటాయించలేదు. నగరాభివృద్ధికి నిధులివ్వలేదు.
– రమేశ్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి

విద్యాశాఖకు తగ్గిన కేటాయింపులు



నిజామాబాద్‌అర్బన్‌: కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న 15 శాతం హామీకి ఆమడదూరంలో కేటాయింపులు చేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి రూ. 23,108 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం కంటే తగ్గింది.
–మాదవేడి వినోద్‌ కుమార్‌, జిల్లా అధ్యక్షుడు, బీసీ ఉపాధ్యాయ సంఘం.

అన్ని వర్గాలకు సమప్రాధాన్యం



నిజామాబాద్‌ సిటీ: బడ్జెట్‌లో అన్ని వర్గాలవారికి సమ ప్రాధాన్యమిచ్చారు. ఇది ప్రజామోద బడ్జెట్‌. రూ.3 లక్షల 4వేల కోట్ల 965ల బడ్జెట్‌ చారిత్రాత్మకం. యువత స్వయం ఉపాధికి నిధులు కేటాయించడం శుభపరిణామం.
– కోనేరు సాయికుమార్‌, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు

కేటాయింపులు హర్షణీయం



బడ్జెట్‌లో ఐటీ ఆధారిత సేవలకు రూ.774 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయం. కృత్రిమ మేధ, బ్లాక్‌ చైన్‌ వంటి కట్టింగ్‌ ఎడ్జ్‌ టెక్నాలజీలకు ప్రాధాన్యత ఇస్తూ ఆధునిక ప్రక్రియల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది.
– సంపత్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, తెయూ

రైతు వ్యతిరేక బడ్జెట్‌



నిజామాబాద్‌ రూరల్‌: బడ్జెట్‌ పూర్తిగా రైతు వ్యతిరేకంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం పిచ్చి తుగ్లక్‌ పాలన కొనసాగిస్తుంది. అంకెల గారడీతో ప్రజలను కాంగ్రెస్‌ ప్రభుత్వం మోసం చేస్తుంది.
– దాదన్నగారి విఠల్‌ రావు , జడ్పీ మాజీ చైర్మన్‌

విద్యా రంగానికి పెద్దపీట



బడ్జెట్‌లో విద్యారంగానికి రూ. 23,108 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయం. పాఠశాలల్లో సమస్యల పరిష్కారంతోపాటు విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. రూ.11,600 కోట్లతో ఇంటిగ్రేటెడ్‌ గురుకులాలతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.
– పెంట జలంధర్‌, పీఆర్టీయూ నాయకుడు, ఆర్మూర్‌

విద్యా, వైద్యానికి ప్రాధాన్యమివ్వలేదు



నిజామాబాద్‌ సిటీ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్య, ఆరోగ్యం, కార్మిక శాఖలకు సరిన్న ప్రాధాన్యం కల్పించలేదు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.300 ఇచ్చే ప్రస్తావన లేదు. ఇది అసమగ్ర, అసంపూర్తి బడ్జెట్‌.
– ఓమయ్య, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి

క్రీడా రంగానికి పెద్దపీట



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో క్రీడారంగానికి పెద్దపీట వేసింది. రూ. 465 కోట్లు కేటాయించడం హర్షణీయం. త్వరలోనే జిల్లా కేంద్రంలో ఎనిమిది లైన్‌లతో స్టేడియం నిర్మాణం జరుగుతుంది.
– సయ్యద్‌ ఖైసర్‌, జాతీయ అథ్లెటిక్స్‌ గోల్డ్‌ మెడలిస్టు, కాంగ్రెస్‌ నాయకులు

నాణ్యమైన చికిత్సకు దోహదం



వైద్య, ఆరోగ్య శాఖకు రూ.12,393 కోట్లు కేటాయించడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో నిరుపేద రోగులకు నాణ్యమైన చికిత్సను అందించేందుకు ఆస్కారం ఏర్పడనుంది. ఉస్మానియా మెడికల్‌ కాలేజీ నిర్మాణానికి రూ.2,700 కోట్లు కేటాయింపుతో వైద్యవిద్యతోపాటు పట్టణ ప్రాంత రోగులకు ఉపయోగకరంగా ఉంటుంది.
– డాక్టర్‌ రమేశ్‌, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్‌

ఆర్భాటం ఆరుపాళ్లు..పని మూడుపాళ్లు



నిజామాబాద్‌ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ 'ఆర్భాటం ఆరు పాళ్లు.. పని మూడు పాళ్లు'' అన్నట్టుంది. ఈ బడ్జెట్‌లో పేద కూలీలను పట్టించుకోలేదు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తామన్న రూ.2,500ల ఊసేలేదు. కౌలు రైతులకు రైతు భరోసా కనుచూపు మేరలో లేదు.
– పెద్ది వెంకట్రాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

సాహో సునీత



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్‌ క్షేమంగా నేలపైకి చేరడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

అద్భుతమైన పునరాగమనం



అంతరిక్షం నుంచి భూమికి 9 నెలల తర్వాత సునీతా విలియమ్స్‌ రాక నిజంగా అంతరిక్ష శాస్త్రం, సాంకేతికతలో పురోగతికి గొప్ప రుజువు. అంతరిక్ష వాతావరణంలో సూక్ష్మజీవులు, మొక్కల మనుగడపై పరిశోధన చేసింది. యువ శాస్త్రవేత్తలు సునీతా విలియమ్స్‌ను స్ఫూర్తిగా తీసుకొని భారతదేశాన్ని ప్రపంచంలో నంబర్‌వన్‌గా నిలబెట్టాలి.
– డాక్టర్‌ వాసం చంద్రశేఖర్‌, అధ్యాపకులు, తెయూ

దేశానికి గర్వకారణం



రుద్రూర్‌: వ్యోమగామి సునీతా విలియమ్స్‌ క్షేమంగా భూమిపై అడుగుపెట్టడం ఎంతో ఆనందం కలిగించింది. భారత సంతతికి చెందిన ఆమె సునీత అంతరిక్షంలో అధిక రోజులు ఉండి రావడం గర్వకారణం. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని నిరూపించారు.
– శ్రీకాంత్‌ , పొతంగల్‌

సునీత తెగువ స్ఫూర్తిదాయకం



బోధన్‌: అంతరిక్షంలో పరిశోధనకు వెళ్లి తొమ్మిది నెలల తర్వాత వచ్చిన సునీతా విలియమ్స్‌ సాహసం, పట్టుదల నేటి యువ శాస్త్రవేత్తలకు స్ఫూర్తిదాయకం. మహిళలు ఏ రంగంలోనైనా ప్రతిభ చాటి సత్తాచాటుతారని నిరూపించారు.
– నవిత, విద్యావంతురాలు, తాణాకలాన్‌ (ఎడపల్లి)

స్ఫూర్తిమంతురాలు



సునీతా విలియమ్స్‌ అందరికీ స్ఫూర్తిమంతురాలు. అంతరిక్షంలో ఆమె చేసిన ప్రయాణం నిజంగా అద్భుతం. భారత సంతతికి చెందిన వ్యోమగామి కావడం గర్వకారణం.
– బాలకృష్ణ, ఆర్మూర్‌

క్రైం కార్నర్‌

నీటితొట్టిలో పడి చిన్నారి మృతి



దుర్గాభవాని మృతదేహం

నిజాంసాగర్‌(జుక్కల్‌): ఇంటి ఎదుట సరదాగా ఆడుకుంటూ వెళ్లి పశువుల నీటి తొట్టిలో పడి మూడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్‌ మండలం సింగీతంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సింగీతం గ్రామానికి చెందిన బిచ్చం గజ్జెలయ్యకు ఇద్దరు భార్యలు. చిన్న భార్య సుశీల కూతురు దుర్గాభవాని(3) బుధవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఆడుకుంటూ వెళ్లి పశువుల నీటి తొట్టిలో పడింది. ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న దుర్గాభవానీ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు అనుమానం వచ్చి నీటితొట్టిలో చూడగా అప్పటికే చిన్నారి నీట మునిగి మరణించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి



రాములు మృతదేహం

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్‌ గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులు చేస్తున్న ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందాడు. మెదక్‌ జిల్లా రామాయంపేటకు చెందిన రాములు (32) బస్వాపూర్‌ ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనుల్లో కూలీగా పనిచేస్తున్నాడు. బుధవారం సెంట్రింగ్‌ పనులు చేస్తుండగా పైన ఉన్న విద్యుత్‌ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు భిక్కనూరు పోలీసులకు సమాచారం అందించారు.

సిరికొండలో రైతు..

సిరికొండ: మండలంలోని దుప్యతండాకు చెందిన రైతు మలావత్‌ రమేశ్‌(45) పొలం వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ బుధవారం తెలిపారు. పొలానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన రమేశ్‌ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా మోటారు వైరు తగిలి చనిపోయినట్లు గుర్తించారన్నారు. మృతుడి భార్య నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఇందల్వాయి: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి(30) మృతి చెందినట్లు ఎస్సై మనోజ్‌ తెలిపారు. ఇందల్వాయి బస్టాండ్‌లో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి స్పృహతప్పి పడిపోగా స్థానికుల సమాచారంతో పోలీసులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం సదరు వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. స్పృహలో ఉన్నప్పుడు తనది ఒంగోలు జిల్లాని అని చెప్పాడని, సంబంధికులు ఎవరైనా ఇందల్వాయి పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

- వేర్వేరు చోట్ల పట్టుబడిన 9వాహనాలు
- కేసులు నమోదు చేసిన అధికారులు

బోధన్‌ టౌన్‌ (బోధన్‌): ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు వాహనాలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ వెంకటనారాయణ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌, టిప్పర్‌తోపాటు వే బిల్లు ట్యాంపరింగ్‌ చేసి ఇసుక తరలిస్తున్న మరో టిప్పర్‌ను పట్టుకున్నామన్నారు. అధికారులను మోసగించేందుకు యత్నించిన టిప్పర్‌ యజమానిపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

మందర్నాలో ఐదు ఇసుక టిప్పర్లు..

బోధన్‌: సాలూర మండలం మందర్నా గ్రామ శివారులోని ఇసుక క్వారీ నుంచి ఓవర్‌ లోడ్‌తో వెళ్తున్న ఐదు ఇసుక టిప్పర్లను ఆర్టీవో టాస్క్‌ఫోర్స్‌ స్క్వాడ్‌ బృందం బుధవారం సాయంత్రం పట్టణ శివారులో పట్టుకుంది. స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా తనిఖీ చేశామని ఏఎంవీఐ శ్రీకాంత్‌ తెలిపారు. పట్టుబడిన ఇసుక టిప్పర్లను సీజ్‌ చేసి, యజమానులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పొతంగల్‌లో..

రుద్రూర్‌: పొతంగల్‌ మండలంలోని మంజీరా నది రెండో బ్రిడ్జి సమీపంలో ఓ ఇసుక టిప్పర్‌ను బుధవారం స్థానికులు పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు తీసుకెళ్లాల్సిన ఇసుకను మహారాష్ట్రకు తరలిస్తున్నారనే సమాచారంతో స్థానికులు నిఘా వేసి టిప్పర్‌ను పట్టుకున్నారు. వేబిల్లు లేకపోవడంతో టిప్పర్‌ను కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌ బోల్తా



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని గోలిలింగాల గ్రామశివారులో మంజీరా వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ బుధవారం అదుపుతప్పి పంటపొలాల్లో బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌లోని ఇసుక వరి పైరును కప్పేసింది. నాగిరెడ్డిపేట, జలాల్‌పూర్‌ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఇసుక తరలిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ ప్రొఫెసర్‌ యాదగిరి రావు

- వీసీ ప్రొఫెసర్‌ యాదగిరి రావు
- తెలంగాణ యూనివర్సిటీలో స్పోర్ట్స్‌ మీట్‌- 2025 ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడా నైపుణ్యాలను అలవర్చుకోవాలని, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ టీ యాదగిరి రావు తెలిపారు. తెయూ క్యాంపస్‌ క్రీడామైదానంలో యాన్యువల్‌ డే స్పోర్ట్స్‌ మీట్‌ -2025ను బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జీవితంలో గెలుపు, ఓటములు సహజమని ఈ విషయాన్ని విద్యార్థులు క్రీడాపోటీల ద్వారా అలవర్చుకోవాలన్నారు. ఈ నెల 29వరకు పోటీలు జరుగుతాయన్నారు. వాలీబాల్‌, ఖోఖో, కబడ్డీ, క్రికెట్‌, బ్యాడ్మింటన్‌ పోటీలను బాలికలకు, బాలురకు వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులకూ వాలీబాల్‌, క్రికెట్‌ పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ మామిడాల ప్రవీణ్‌, పీఆర్వో ఏ పున్నయ్య, స్పోర్ట్స్‌ డైరెక్టర్‌ జీ బాలకిషన్‌, పీడీ బీఆర్‌నేత, కోచ్‌లు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమీల్‌ అహ్మద్‌కు అబ్దుల్‌ కలాం నేషనల్‌ లైఫ్‌ టైం అచీవ్‌మెంట్‌ అవార్డు



జమీల్‌ అహ్మద్‌ను అభినందిస్తున్న తెయూ వీసీ, రిజిస్ట్రార్‌

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో హిందీ విభాగం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఎండీ జమీల్‌ అహ్మద్‌ బోధన, పరిశోధన రంగంలో డాక్టర్‌ ఏపీజే అబ్దుల్‌ కలాం లైఫ్‌ టైం అచీవ్‌మెంట్‌ అవార్డు అందుకున్నారు. బెంగుళూరుకు చెందిన ఇంటర్నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ సోషల్‌ అండ్‌ ఎకనామిక్‌ రిఫార్మ్స్‌ సంస్థ సోమవారం అవార్డును అందజేసింది. తెయూ వీసీ ప్రొఫెసర్‌ టీ యాదగిరి రావు, రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం యాదగిరి అవార్డు అందుకున్న జమీల్‌ అహ్మద్‌ను బుధవారం అభినందించారు. కార్యక్రమంలో టూటా అధ్యక్షుడు ఏ పున్నయ్య, ప్రిన్సిపాల్‌ మామిడాల ప్రవీణ్‌, అధ్యాపకులు సత్యనారాయణ రెడ్డి, మహమ్మద్‌ అబ్దుల్‌ ఖవి, మూసా ఖురేషీ, పార్వతి, గుల్‌-ఏ-రాణా తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి జైలు

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ బుధవారం తెలిపారు. సీపీ, ట్రాఫిక్‌ ఏసీపీ ఆదేశాలతో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందిని పట్టుకొని కౌన్సిలింగ్‌ అనంతరం సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ ఎదుట హాజరుపర్చామన్నారు. తొమ్మిది మందికి రూ.13,500 జరిమానా విధించి, మిగతా నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ఆర్మూర్‌లో ఒకరికి..

ఆర్మూర్‌టౌన్‌: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఓ వ్యక్తికి రెండురోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ ఆర్మూర్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ గట్టు గంగాధర్‌ తీర్పునిచ్చినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

సిరికొండ: రేషన్‌ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని అధికారులు పట్టుకొని తమకు అప్పగించినట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ బుధవారం తెలిపారు. సిరికొండకు చెందిన రియాజ్‌, ముచ్కూర్‌ గ్రామానికి చెందిన పుప్పాల బాలకిషన్‌, ధిరావత్‌ లక్ష్మణ్‌ అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని ఎమ్మార్వై గంగరాజం, ఏఆర్‌ఐ నాగన్న పట్టుకున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'డ్యూటీలో ఎవరూ లేరు.. డంప్‌లు తరలించుకోండి'

- ఇసుక వ్యాపారితో ఆర్‌ఐ ఫోన్‌ సంభాషణ వైరల్‌

బోధన్‌రూరల్‌: ఇసుక వ్యాపారితో బోధన్‌ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ గంగాధర్‌ ఫోన్‌ సంభాషణ బుధవారం రాత్రి సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారింది. ' ఈ రోజు మా రెవెన్యూ అధికారులు ఎవరూ డ్యూటీలో ఉండరు. తనిఖీలు ఉండవు. డంప్‌లు తరలించుకోండి' అంటూ ఇసుక వ్యాపారం చేసే అజీజ్‌ అనే వ్యక్తితో ఆర్‌ఐ మాట్లాడారు. ఇసుక వ్యాపారి, ఆర్‌ఐ మధ్య లావాదేవీల్లో తేడాలు రావడంతోనే ఫోన్‌ సంభాషణ బయటికి వచ్చినట్లు ఇసుక వ్యాపారులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ విఠల్‌ను సంప్రదించగా.. ఫోన్‌ సంభాషణ తమ దృష్టికి వచ్చిందని ఉన్నతాధికారులకు వివరించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పిచ్చుకకు ముప్పే!

- ఉసురు తీసుకుంటున్న రేడియేషన్
- నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: పొద్దున్నే ఇంటి ముంగిట పిచ్చుకలు గుంపులుగా వచ్చి కిచకిచలతో చేసే సందడి అంతాఇంతా కాదు. మనుషుల మధ్య సన్నిహితంగా తిరిగే గుణమున్న ఊర పిచ్చుకలు మానవుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఇమడలేకపోతున్నాయి. అడ్డగోలుగా పెరిగిపోతున్న రేడియేషన్ వాటిని బలితీసుకుంటోంది. దీనికి తోడు పల్లెలు, పట్టణాలు, నగరాలన్నీ కాంక్రీటు వనాలుగా మారుతున్న పరిస్థితుల్లో వాటి ఉనికికి ప్రమాదం ముంచుకొచ్చింది. పిచ్చుకలకు ఆహారం దొరక్కపోవడం, తాగడానికి కూడా నీళ్లు దొరకని పరిస్థితి తలెత్తుతోంది. ఇప్పటికే అనేక రకాల పక్షి జాతులు అంతరించిపోగా, పిచ్చుకలు కూడా క్రమేపి తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నేడు అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

పక్షి ప్రేమికుల ప్రత్యేక ఏర్పాట్లు..

పిచ్చుకలు సొంతంగా గడ్డిపోచలతో గూళ్లు కట్టుకోవడం వాటికి అలవాటు. చాలా వరకు చెట్ల కొమ్మలకు గరికతో గూడు కట్టుకుని అందులో నివసిస్తాయి. ఒక్కో గడ్డిపోచను తీసుకువచ్చి పొదరిళ్లను అల్లుకుంటాయి. అందులోనే స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని జీవిస్తాయి.

పట్టణాల్లో నివసించే వారిలో కొందరు పిచ్చుకల మీద మక్కువతో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గూళ్లను కొనుగోలు చేసి ఇంటి ఆవరణల్లో తీసువచ్చి ఏర్పాటు చేస్తున్నారు. కొందరు అట్ట డబ్బాలను కూడా పిచ్చుక గూళ్లగా వాడుతున్నారు. వాటికి కావలసిన ఆహారం, తాగునీరు అందించే ప్రయత్నం చేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఎండలు ముదిరిన కొద్దీ పిచ్చుకలకు ఆహారం దొరక్కపోవడం, దాహం తీర్చుకునేందుకు నీరు దొరక్క చాలా వరకు చనిపోతుంటాయి. దీంతో పక్షి ప్రేమికులు చాలా వరకు పిచ్చుకల కోసం ఇంటి ముందర గోడపై, వరండాల్లో నీటి తొట్లు, ఆహారం ఏర్పాటు చేస్తున్నారు. కొందరి ఇళ్లకు వెళితే పిచ్చుకల అరుపులు ఇట్టే వినబడుతుంటాయి. పిచ్చుకలకు వారు ఆవాసం ఏర్పాటు చేయడంతో వాళ్ల ఇళ్ల చుట్టూ తిరుగుతుంటాయని చెబుతున్నారు.



పిచ్చుకలు ఏర్పాటు చేసుకున్న గూళ్లు..



కామారెడ్డికి చెందిన చిత్రకారుడు రమేశ్ వేసిన పిచ్చుక చిత్రం







తమ ఇళ్ల వద్ద పిచ్చుకల కోసం నీరు, ఆహారం ఏర్పాటు చేసిన చిన్నారులు దేవి, మైత్రి, వర్షిణి, నిహారిక, మోహన్

చిట్టి చేతులతో చిన్నసాయం

- పిచ్చుకల దాహార్తి తీర్చడానికి చిన్నారుల ప్రయత్నం
- టీచర్ సూచనతో ఇళ్ల వద్ద నీటి సౌకర్యం ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: విద్యార్థులకు చదువుతో పాటు సమాజం పట్ల అవగాహన కల్పిస్తే వారు మంచి పౌరులుగా తయారవుతారు. చాలా మంది ఉపాధ్యాయులు వివిధ అంశాలపై విద్యార్థులను ప్రోత్సహిస్తుంటారు.

ఈ నేపథ్యంలోనే కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ అశోక్‌కుమార్ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వేసవిలో పక్షుల దాహార్తి తీర్చే బాధ్యత అప్పగించారు. ఖర్చు లేకుండా ఇంట్లో ఉన్న గిన్నెల్లో నీరు, ఆహారం పోసి పక్షుల ఆకలి, దాహం తీర్చాలని సూచించారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన వాటితో సెల్ఫీ దిగి పంపాలని తెలపడంతో బుధవారం అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా చాలా మంది విద్యార్థులు సెల్ఫీ దిగి పంపించారు.

విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఏర్పాటు చేసిన నీటి తొట్టెలతో పక్షులకు ముఖ్యంగా పిచ్చుకల దాహార్తి తీరనుంది. ఈ సందర్భంగా విద్యార్థులను, అలాగే విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయుడిని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



అశోక్‌కుమార్, టీచర్



సాయితేజ



యశ్వంత్



శరత్‌చంద్ర



సిద్దార్థ



సయ్యద్ అర్ఫాన్

'మధ్యాహ్న' ఏజెన్సీలకు ఊరట

- విద్యార్థులకు అందిస్తున్న గుడ్డు ధర పెంపు
- రూ.5 నుంచి రూ.6లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కలుగనున్న ప్రయోజనం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందిస్తున్న కోడిగుడ్డు ధరను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వారంలో మూడు రోజులు గుడ్డు అందిస్తున్నారు. ఇటీవల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో భారం మోయలేమంటూ మధ్యాహ్న భోజన ఏజెన్సీల బాధ్యులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కొన్ని పాఠశాలల్లో వారంలో గుడ్డుకు బదులు అరటి పండు ఇస్తుండగా.. ఇంకొందరు వారంలో ఒక గుడ్డుతో సరిపెడుతున్నారు. మార్కెట్‌లో గుడ్డు ధరలకు, ప్రభుత్వం చెల్లించే ధరకు వ్యత్యాసం ఉండడం ఏజెన్సీలకు అదనపు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గుడ్డు ధరను రూ.5 నుంచి రూ.6లకు పెంచుతూ ఆదేశాలు జారీ చేయడం ఏజెన్సీలకు ఊరటనిచ్చింది.

బహిరంగ మార్కెట్‌లో ధర రూ.6.50 పైనే..

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు గుడ్డు ధరను రూ.5 నుంచి రూ.6లకు ప్రభుత్వం పెంచినప్పటికీ బహిరంగ మార్కెట్‌లో మాత్రం రూ.6.50 నుంచి రూ.7 వరకు ఉంది. బహిరంగ మార్కెట్‌లో ధర పెరుగుతుండడంతో ఏజెన్సీలకు భారంగా మారుతోంది. జిల్లాలోని 1151 ప్రభుత్వ పాఠశాలల్లో 97,252 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు విడుదల చేస్తాయి. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు వండిపెట్టేందుకు రూ.6.19, 6 నుంచి 8వ తరగతి వరకు రూ.9.29 స్లాబ్ ధరలతోపాటు కోడిగుడ్డుకు అదనంగా రూ.5 రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. 9, 10వ తరగతులకు రూ.10.68 బిల్లును కోడిగుడ్డు ధర కలిపి చెల్లిస్తోంది. స్కూళ్లకు బియ్యం ఉచితంగా సరఫరా చేస్తోంది. మెనూ ప్రకారం విద్యార్థులకు సోమ, బుధ, శుక్రవారాల్లో మధ్యాహ్న భోజనంలో ఉడికించిన కోడిగుడ్డు అందించాలి. గతంలో గుడ్డుకు రూ.4 చెల్లించే ప్రభుత్వం 2022లో అప్పటి ధరల ప్రకారం రూ.5లకు పెంచింది. కానీ కొద్ది నెలలుగా గుడ్డు ధర ఒక్కసారిగా పెరగడంతో చాలా పాఠశాలల్లో వారానికి ఒకటి, రెండు సార్లు మాత్రమే అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు పోషకాహారానికి దూరం అవుతున్నారు.



మూడు రోజులు అందించాలి



గుడ్డు ధరలు పెంచుతూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మార్కెట్లో గుడ్డు ధరలు పెరగడంతో ఏజెన్సీల నిర్వాహకులు కొంత ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. గుడ్డు ధర రూపాయి పెంచడం వల్ల ఏజెన్సీలు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. పోషకాహారంలో భాగంగా విద్యార్థులకు విధిగా వారానికి మూడు రోజులు ఉడకబెట్టిన గుడ్డు అందించాల్సి ఉంటుంది. – అశోక్‌కుమార్, డీఈవో, నిజామాబాద్

కలెక్టర్ చెంతకు డైట్ 'టెండర్'

- ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు
- పాత కాంట్రాక్టర్ వైపే మొగ్గు!
- మిగతా సభ్యుల ఒత్తిడితో ఆర్డర్ కాపీ పెండింగ్

నిజామాబాద్ నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో డైట్ టెండర్ దాదాపు పూర్తయ్యింది. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రక్రియ పూర్తి చేశారు. పాత కాంట్రాక్టర్ వైపే కమిటీ మొగ్గు చూపగా, మిగతా టెండర్‌దారులు లక్కీ డ్రా నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో కాస్త వెనక్కి తగ్గిన అధికారులు ఆర్డర్ కాపీ పెండింగ్‌లో పెట్టారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం పూర్తి చేస్తామని చెప్పి పంపించేశారు. కాగా, పాత కాంట్రాక్టర్‌పై ఫిర్యాదులు వచ్చినా టెండర్ ఎలా ఇస్తారని పలుమార్లు కాంట్రాక్టర్లు సైతం అధికారులకు విన్నవించిన విషయం తెలిసిందే. టెండర్ కమిటీ సభ్యులు మాత్రం అంతా పూర్తి చేశామని, పాత కాంట్రాక్టర్‌కే ఇస్తున్నామని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. తెరవెనుక ముడుపుల వ్యవహారం నడిచిందా? లేదా ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏదీ ఏమైనా కలెక్టర్ కోర్టులో ఉన్న టెండర్ ఏ విధంగా ఫైనల్ చేస్తారో వేచి చూడాల్సిందే.

కలెక్టర్ అనుమతి కోరాం

జీజీహెచ్ టెండర్ ప్రక్రియ పూర్తి అయినట్లే. పాత కాంట్రాక్టర్‌కే టెండర్ ఇచ్చేందుకు కమిటీ సభ్యులు ఓకే చేసేశారు. మిగతా దరఖాస్తుదారులు ప్రశ్నించడంతో కాస్త ఆలస్యం చేస్తున్నాం. కలెక్టర్ అనుమతి తీసుకొని ఫైనల్ ఆర్డర్ ఇస్తాం. ప్రస్తుతం యథావిధిగా పాత కాంట్రాక్టర్ ద్వారానే డైట్ కొనసాగుతుంది. – కిరణ్‌కుమార్, అదనపు కలెక్టర్

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

నిరాశ పరిచింది



ప్రతి ఏడాది రాష్ట్ర బడ్జెట్లో 15 శాతం నిధులు విద్యా రంగానికి కేటాయిస్తామన్న హామీ అమలకు నోచుకోవడం లేదు. బడ్జెట్‌లో విద్యారంగానికి 7.5శాతం నిధులు కేటాయించ డం నిరాశపరిచింది. – అంకం నరేశ్, ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎం

సంక్షేమాన్ని విస్మరించిన బడ్జెట్

బడ్జెట్‌లో ప్రభుత్వం సామాన్యులను పట్టించుకోలేదు. వ్యవసాయ రంగంపై సవతితల్లి ప్రేమ కనబర్చింది. వైద్యంపై నిధులకోత విధించగా, వ్యవసాయ కూలీలకు నిధులు కేటాయించలేదు. పసుపు రైతులపై కరుణ చూపలేదు. – వి ప్రభాకర్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు

వనరుల సృష్టి లేదు



బడ్జెట్ అంచనాలకు తగిన విధంగా వనరుల సృష్టి జరగాలి. రూ.3,04,965 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. రూ.2,26,982 కోట్లు రెవెన్యూ వ్యయంగాను, రూ.36,504 కోట్లు మూలధన వ్యయంగాను కేటాయింపు లు ఉన్నాయి. నిజానికి గత బడ్జెట్‌ను పరిశీలి స్తే రూ. 2.91 లక్షలు అంచనా వేస్తే రూ.2.20 లక్షలు మాత్రమే వివిధ ఆదాయ వనరుల ద్వారా సమకూరాయి. – ఏ.పున్నయ్య అసిస్టెంట్ ప్రొఫెసర్, తెయూ

చనిపోయిన వారి పేరుతో రుణాలు

- ఒకరు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రకాశ్



వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చోళ మండల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపని లిమిటెడ్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు చనిపోయిన వారి పేరుతో సుమారు రూ.కోటి 39 లక్షల 90 వేల రుణం తీసుకుని మోసానికి పాల్పడ్డారని ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కంపనీ హెడ్ ఆఫీస్ జోనల్ లీగల్ మేనేజర్ పీ.గగన్‌దీప్ అగర్వాల్ గత జనవరి 9న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరిపించగా అందులో పని చేసే సిబ్బందే మోసాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. మంచిర్యాల బ్రాంచ్ మేనేజర్ చల్ల ప్రవీణ్‌రెడ్డి, కరీంనగర్ ఏరియాలో ఏసీఎంగా పని చేసిన చిట్టేటి అశోక్‌రెడ్డి పథకం ప్రకారం ఈ మోసానికి పాల్పడ్డారన్నారు. కాగా బుధవారం ప్రవీణ్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, అశోక్‌రెడ్డి పరారీలో ఉన్నాడన్నారు. చెన్నూర్ మండలం కత్తెరశాల, కిష్టపేట గ్రామాలకు చెందిన మృతులు చేతెల్లి సమ్మయ్య పేరుతో రూ.25,90 లక్షలు, చల్ల రామయ్య పేరుతో రూ.20 లక్షలు, చేతెల్లి చిన్న బక్కయ్య పేరుతో రూ.20 లక్షలు, దోమల సారమ్మ పేరుతో రూ.24 లక్షలు, చల్ల రవీందర్ పేరుతో రూ.25 లక్షలు, బొజ్జ మల్లయ్య పేరుతో రూ.25 లక్షలు తీసుకుని సొంతానికి వాడుకున్నారన్నారు. ఈ కేసులో ప్రవీణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డికి మరి కొంతమంది సహకరించినట్లు విచారణలో తేలిందన్నారు. త్వరలో వారిని సైతం అరెస్ట్ చేస్తామన్నారు.

నీటి గోస తీర్చండి

- అధికారుల ఎదుట గోడు వెల్లబోసుకున్న సుంగాపూర్ గ్రామస్తులు
- 'సాక్షి' కథనంతో కదిలిన యంత్రాంగం

సాక్షి స్పందన

నార్నూర్: 'నీళ్ల కోసం ఇంకెంత కాలం తిప్పలు పడాలే.. గొంతు తడువాలంటే బిందెలు పట్టుకుని కిలోమీటర్ దూరం వెళ్లాల్సి వస్తుంది.. ఏండ్లు గడుస్తున్నా మా గోస తీరట్లే.. ఈ సమస్యతో మా ఊరి పిలగాండ్లకు పిల్లను కూడా ఇస్తలేరు.. పశువులను కూడా వేరే చోటుకు తీసుకెళ్లాల్సి వస్తోంది..' అంటూ ఆ గ్రామానికి విచ్చేసిన అధికారుల ఎదుట ఆదివాసీలు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని సుంగాపూర్ గొండుగూడలో తాగునీటి ఇక్కట్లపై 'గుక్కెడు నీటికి అరిగోస' శీర్షికన 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అధికారులు ఉదయాన్నే గ్రామానికి చేరుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఎంపీవో సాయిప్రసాద్ స్థానికులతో మాట్లాడి నీటి సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ఇబ్బందులను వివరించారు. ఉన్నతాధికారులు వచ్చి శాశ్వత పరిష్కారం చూపేంత వరకు వారిని కదలనీయబోమని అక్కడే కుర్చొని నిరసన తెలిపారు. విషయం కలెక్టర్ దృష్టిలో ఉందని, ప్రతి పాదనలు సైతం పంపామని, వారం రోజుల్లో ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని గ్రామస్తులకు అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే స్పష్టమైన హామీ ఇవ్వాలని స్థానికులు పట్టుబట్టారు. ఈ మేరకు అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈతో సెల్‌ఫోన్‌లో మాట్లాడించారు. ఆయన నచ్చజెప్పడంతో వారు శాంతించారు. విషయం తెలుసుకున్న సీఐ రహీం పాషా గోండుగూడను సందర్శించి స్థానికులతో మాట్లాడారు. శాంతియుత మార్గంలో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో స్థానికులు మాడవి లచ్చు పటేల్, కనక తెలంగాణారావు, కొడప లింగు, పెందూర్ లక్ష్మణ్, భీంరావ్ తదితరులున్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఈ శ్రీనివాస్

సైబర్ నేరగాళ్ల బురిడీ..

- ఖాతాలోంచి రూ.56వేలు మాయం



రామకృష్ణాపూర్: టికెట్ క్యాన్సిల్ ఎలా చేయాలని కష్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్‌లో వెతకడమే అతను చేసిన తప్పు. ఓ లింక్ పంపిస్తామని దాని ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అవతలి వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి యాప్ డౌన్‌లోడ్ చేశాడు. ఇంకేముంది అకౌంట్‌లో నుంచి రూ.56వేలు పోగొట్టుకున్నాడు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఏజోన్ ఏరియాకు చెందిన సదానందం ఇటీవల తత్కాల్ ద్వారా బుక్ చేసిన రైల్వే టికెట్‌ను క్యాన్సిల్ ఎలా చేయాలని గూగుల్‌లో కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతికాడు. అందులో లభించిన ఓ నంబర్‌కు ఫోన్ చేయడంతో అవతలి వ్యక్తి పలు సూచనలు చేశాడు. టికెట్ క్యాన్సిల్ కోసం తాము సహాయం చేస్తామని, ముందుగా తాము పంపిన లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. అనంతరం ఫోన్‌పే యాప్ ఓపెన్ చేసి తన బ్యాంకు ఖాతా చూసుకోమని చెప్పగా అందులో నుండి రూ.56 వేలు మాయమయ్యాయి. బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయగా సైబర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నగదు, ఆభరణాలు షాపుల్లో ఉంచొద్దు

- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: షాపులు, మాల్స్‌లో భారీ మొత్తంలో నగదు, ఆభరణాలు నిల్వ ఉంచవద్దని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దొంగలు టెక్నాలజీని వాడి చోరీలకు పాల్పడుతున్నారని, షాపుల యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు రోజుల క్రితం దస్నాపూర్‌లోని నేషనల్ మార్ట్‌లో జరిగిన చోరీకి కటింగ్ గ్రైండర్ ఉపయోగించి లాకర్‌ను పగులగొట్టారన్నారు. ఆ మార్ట్ పక్కన నిచ్చెన ఉండగా, దాని సహాయంతో పైకి ఎక్కి రేకులకు ఉన్న బోల్టులు తొలగించి షాపులోనికి చొరబడినట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడే ముందు సీసీ కెమెరాలో ఫుటేజీ నమోదు కాగా దాని తర్వాత కనెక్షన్ తొలగించినట్లు పేర్కొన్నారు. దొంగను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టించిన వారికి నజరానా ఇస్తామన్నారు. షాపులు, మాల్స్‌లో లాకర్‌సేఫ్ అని నమ్మవద్దని, కటర్లతో వాటిని సైతం పగులగొడుతున్నారన్నారు. షాపుల ముందు హ్యూమెన్ అలర్ట్ డిటెక్షన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నగదును షాపులో ఉంచకుండా ఎప్పటికప్పుడు బ్యాంకుల్లో జమ చేయాలన్నారు. టెక్నాలజీతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగకు సంబంధించిన చిత్రాన్ని విడుదల చేశారు.

భర్త చేతిలో భార్య హతం



నిరోజ(ఫైల్)

ఖానాపూర్: భర్త చేతిలో భార్య హతమైన సంఘటన మంగళవారం రాత్రి నిర్మల్ జిల్లా పెంబి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఖానాపూర్ సీఐ సీహెచ్ అశోక్ తెలిపిన ప్రకారం.. ఖానాపూర్ మండలంలోని బావాపూర్(ఆర్) తండాకు చెందిన లావుడ్య అర్జున్‌కు గోసంపల్లె గ్రామానికి చెందిన నిరోజ(25)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం రాత్రి అతిగా మద్యం సేవించిన అర్జున్ భార్య నిరోజను కొట్టడంతో మృతిచెందింది. బుధవారం ఉదయం మృతి విషయం తెలిసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి సోదరుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు. ఘటన స్థలాన్ని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనన్ సందర్శించారు. ఆయన వెంట పెంబి ఎస్సై హన్మాండ్లు ఉన్నారు.

ఆస్పత్రి భవనం ప్రారంభమెప్పుడో..!

- రూ.8.50 కోట్లతో నిర్మాణం
- టెండరు దశలోనే మార్చురీ గది

లక్సెట్టిపేట(మంచిర్యాల): 2023 ఏప్రిల్‌లో రూ.8.50 కోట్ల నిధులతో మండల కేంద్రంలోని పాత బస్టాండు సమీపంలో చేపట్టిన ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. అప్పటి మంత్రి హరీష్‌రావు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట మండలాల ప్రజల కోసం 30 పడకలతో ఆస్పత్రి పక్కా భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా ఫిబ్రవరి మొదటివారంలో ప్రారంభిస్తామని అధికారులు నిర్ణయించినా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆసుపత్రిని పాత ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగిస్తున్నారు. అరకొర సౌకర్యాలతో రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఆస్పత్రి భవనాన్ని త్వరగా ప్రారంభించాలని మూడు మండలాల ప్రజలు కోరుతున్నారు.

టెండరు దశలోనే మార్చురీ గది నిర్మాణం

ఆస్పత్రిలో రెండంతస్తులతో 20 గదులు, ఓటీ, క్యాజువాలిటీ గది, మేల్, ఫిమేల్ వార్డులు, లేబర్ రూం, ఎక్స్‌రే, శానిటేషన్, అన్ని ఏర్పాట్లతో పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రహరీ నిర్మాణం, పైప్‌లైన్‌ల పనులు పూర్తి చేశారు. కానీ మార్చురీ గది నిర్మాణం ఇంకా ప్రారంభించ లేదు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు ఇటీవల ఆసుపత్రిని పరిశీలించి అధికారులతో మాట్లాడి ఆరోగ్య శాఖ నుంచి రూ. కోటి 60 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈనెల 27 వరకు ఆన్‌లైన్ టెండరు ప్రక్రియ పూర్తి కానుంది. స్థల పరిశీలన జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.



ప్రభుత్వాసుపత్రి పక్కా భవనం



ఇటీవల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

త్వరగా పూర్తి చేయాలి



ఆస్పత్రి భవనం పనులు దాదాపుగా పూర్తి అయ్యాయి. మిగతా పనులను అధికారులు త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది. ప్రస్తుత ఆస్పత్రి భవనం రేకుల షెడ్డు కావడంతో ఇబ్బంది అవుతుంది. మార్చురీ లేకపోతే పోస్ట్‌మార్టం చేసేందుకు ఇబ్బంది అవుతుంది. అన్ని పనులు పూర్తి చేసి త్వరగా ప్రారంభించాలి.
– శ్రీనివాస్ ఆసుపత్రి సూపరింటెండెంట్, లక్సెట్టిపేట